సాక్షి
నల్లగొండ
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



హత్యకేసు దర్యాప్తు ముమ్మరం

మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్ హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. - 8లో



ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా

నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం టిప్పర్ ఢీకొని ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. - 8లో



అనుమానాస్పద స్థితిలో..

మిర్యాలగూడలోని హౌజింగ్ బోర్డు కాలనీలో తల్లి కూతుళ్లు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. - 8లో



హనుమాన్ జయంతి సందర్భంగా నల్లగొండలో సాగుతున్న విజయ యాత్ర (ఇన్‌సెట్‌లో స్వామివారు), దేవుళ్ల వేషధారణలో చిన్నారులు

జై హనుమాన్

రామగిరి(నల్లగొండ) : హనుమాన్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలో బజరంగ్‌దళ్ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ విజయ యాత్ర వైభవంగా జరిగింది. పట్టణంలోని పాతబస్తీ హనుమాన్ దేవాలయం నుంచి వీటీ కాలనీ హనుమాన్ దేవాలయం వరకు యాత్ర కొనసాగింది. నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ చీకోటి, కన్నెబోయిన వెంకట్, రాయల రామకృష్ణయ్య, గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

నల్లగొండ : అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో కోరారు. నల్లగొండలోని డీఈఓ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

చెర్వుగట్టులో మాస కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి మాస కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సురేష్ శర్మ, శ్రీకాంత్‌శర్మ, నాగయ్య శర్మ పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనుల అడ్డగింత

మర్రిగూడ : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని శివన్నగూడలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను వెంకేపల్లి భూ నిర్వాసితులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందించి ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పనులు సాగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎస్పీ

నల్లగొండ టూటౌన్ : యువత సన్మార్గంలో నడిచి, క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మహనీయుల జయంతి ఉత్సవాల రెండో రోజు విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు.. త్యాగధనుల ఆశయ సాధనకు కృషి చేసి, స్వీయ సంరక్షణతో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలన్నారు. యువత మత్తు పదార్థాలకు, సైబర్ క్రైమ్‌కు, లింగవివక్ష, హింసకు వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు రంగోలి, క్విజ్, పెయింటింగ్, బాడీ పెయింటింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నర్సింగరావు, ఎంజీయూ ప్రొఫెసర్ డాక్టర్ మద్దిలేటి, ఉత్సవాల చైర్మన్ అంజిరెడ్డి, శ్రీదేవి, ప్రిన్సిపాల్ కె.ప్రేమ్‌సాగర్, సుధారాణి, అరుణప్రియ, సీఓఈ ఉపేందర్‌రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి, హరీష్‌కుమార్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



బాడీ పెయింట్ వేస్తున్న విద్యార్థిని

మఖానా సాగుకు బీజం

ప్రయోగాత్మకంగా కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రారంభం

- ఎకరం విస్తీర్ణంలో విత్తనాలు చల్లిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కొండమల్లేపల్లి ఉద్యాన పరిశోధన సంస్థలో విత్తనాలు చల్లిన అధికారులు
- ఒకే మడిలో మఖానాతోపాటు ఆక్వా సాగుకు చర్యలు : కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



కంపాసాగర్‌లో మఖానా విత్తనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పోషక విలువలు ఉండే మఖానా పంట సాగుకు రాష్ట్రంలో బీజం పడింది. మొదటిసారిగా నల్లగొండ జిల్లాలో ఈ పంట సాగు మొదలైంది. త్రిపురారం మండలంలోని కంపాసాగర్ వ్యవసాయ శాఖ పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా ఒక ఎకరంలో సాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పది గుంటల విస్తీర్ణంలో ప్రత్యేకంగా తయారు చేసిన నారుమడిలో శనివారం మఖానా విత్తనాలను కలెక్టర్ చల్లారు. మరోవైపు జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి హనుమంతరెడ్డి, ఇతర అధికారులు కొండమల్లేపల్లిలోని ఉద్యానవన శాఖ పరిశోధన కేంద్రంలోనూ విత్తనాలు చల్లారు. పలువురు రైతులు కూడా మఖానా సాగుకు ముందుకొస్తుండడంతో ఈ సారి పది ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ఈ సాగు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తొమ్మిది నెలల్లో చేతికి రానున్న పంట

ఈ పంట సాగుచేసిన తొమ్మిది నెలల్లో చేతికి రానుంది. ప్రత్యేకంగా తయారు చేసిన నారు మడిలో వేసిన విత్తనాలు వరి నారు రూపంలో పెంచుతారు. అది ఎదగడానికి మరో రెండు నెలల సమయం పడుతుంది. ఆ తరువాత దానిని వరి నాటులా ఎకరంలో ప్రత్యేకంగా తయారు చేసిన మండిలో వేస్తారు. ఆ తరువాత ఐదు నెలలకు నీటిలోపల కాయ కాసి పంట వస్తుంది.

కలెక్టర్ ప్రత్యేక చొరవ

జిల్లాలో మఖానా సాగుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. గత నెల 4వ తేదీన జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు దేశంలో అత్యధికంగా మఖానా సాగు చేస్తున్న బీహార్‌లోని దర్భంగా ప్రాంతంలో పర్యటించారు. అక్కడి మఖానా బోర్డు అధికారులు, క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి ఈ పంట సాగుపై అధ్యయనం చేసి వచ్చారు. రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించడంతోపాటు వారికి అధిక లాభాలు వచ్చేలా చూసేందుకు మఖానా సాగుకు చర్యలు చేపట్టారు. ఈ పంటను జిల్లాలో సాగు చేయించడం ద్వారా పోషకాలు అత్యధికంగా ఉండే మఖానా రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరలో కేవీకేలోనూ సాగుకు చర్యలు

మఖానా సాగును త్రిపురారంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలోనూ (కేవీకే) మరో రెండు ఎకరాల్లో సాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే వారంలో అక్కడ నారుమడిని సిద్ధం చేసి విత్తనాలను చల్లాలని నిర్ణయించారు. మరోవైపు నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవసాయం క్షేత్రంలోనూ ఈ పంటను సాగు చేయనున్నారు. అలాగే కట్టంగూర్ మండలంలోని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌లో (ఎఫ్‌పీఓ) మఖానాను సాగు చేసేలా చర్యలు చేపడుతున్నారు. చాలా మంది రైతులు ముందుకొస్తున్నా.. ముందుగా కనగల్, నల్లగొండ మండలాల్లో ఇద్దరు రైతులు నర్సిరెడ్డి, మూర్తి వ్యవసాయ క్షేత్రాలు, చింతపల్లిలో ప్రయోగాత్మకంగా సాగు చేయించాలని అధికారులు నిర్ణయించారు.

మఖానా విత్తనాలు చల్లిన కలెక్టర్

త్రిపురారం : మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన మఖానా పంట సాగును కలెక్టర్ ఇలా త్రిపాఠి విత్తనాలు చల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక్కడ ఎకరం విస్తీర్ణంలో మఖానా సాగు చేయడానికి 10 కేజీల విత్తనంతో నారు పోశామన్నారు. అనంతరం వరి పరిశోధన స్థానంలో నూతన వరి వంగడాలను పరిశీలించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మాట్లాడి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కంపాసాగర్ వరి పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, డీఏఓ శ్రవణ్‌కుమార్, హాలియా ఏడీఏ వెంకటరవీంద్ర, ఏఓలు పార్వతీచౌహాన్, ముని కృష్ణయ్య, శివ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, ఎంపీడీఓ విజయకుమారి, ఆర్‌ఐ సైదులు, ఏఈఓ నాగారాజు తదితరులున్నారు.

10 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు

మఖానా పంటను జిల్లాలో పది ఎకరాల్లో సాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ పంటను రెండు రకాలుగా సాగు చేయాలని.. ఒకటి నారు విధానం, మరొకటి నేరుగా వేసే విధానం. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రత్యేక నారు విధానంలో అభివృద్ధి చేసి, ఆ మొక్కలను తీసి నాటేలా చర్యలు చేపడతాం. సెప్టెంబర్, అక్టోబర్ నాటికి నేరుగా వేసేలా ఏర్పాట్లు చేస్తాం. మరోవైపు ఆయా మడుల్లో ఆక్వా కల్చర్‌ను అభివృద్ధి చేస్తాం. రొయ్యలు, చిన్న చేపలు పెంచడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. ఇందులో పెస్టిసైడ్స్ వాడాల్సిన అవసరమే ఉండదు. నీటిలో పెరిగే ఈ మొక్కలకు ముళ్లు ఉంటాయి. మరోవైపు గింజలు నీటిలో రాలాక ప్రత్యేక పద్ధతిలో (గంపలతో) రెండు ఫీట్ల నీటి అడుగు నుంచి సేకరించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ యూనిట్‌ను ఇక్కడే పెట్టాలని ఆలోచన చేస్తున్నాం. కట్టంగూర్ ఎఫ్‌పీఓ నుంచి బ్రాండింగ్ చేయిస్తాం. ఔట్‌లెట్ కూడా ఏర్పాటు చేస్తాం.

– కలెక్టర్ ఇలా త్రిపాఠి



కంపాసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో మఖానా విత్తనాలు చల్లుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

దామరచర్లలో అత్యధికంగా 41.9 డిగ్రీలు నమోదు

నల్లగొండ : భానుడు భగభగ మంటున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఉగ్రరూపం చూపిస్తున్నాడు. దీంతో మధ్యాహ్నం వేళ జనం రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైనే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా దామరచర్ల మండలంలో 41.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అతి తక్కువగా చింతపల్లి మండలం గొడకొండ్లలో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ నెల సగంలోనే ఇలా ఉంటే.. మే నెలలో ఎండల తీవ్రత ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా..

తిరుమలగిరి సాగర్‌లో 41.8 డిగ్రీలు, చిట్యాల 41.5, త్రిపురారం 41.4, మాడ్గులపల్లి 41.3, నార్కట్‌పల్లి 41.0, నిడమనూరు 40.8, అనుముల 40.7, నల్లగొండ 40.6, చందంపేట 40.4, కట్టంగూర్ 40.3, కనగల్ 40.2, గుర్రంపోడు 40.1, దేవరకొండ 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక.. చండూరు, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ, మునుగోడు, నాంపల్లి, తిప్పర్తి, గుర్రంపోడు, పెద్దవూర, అనుముల, మర్రిగూడ, శాలిగౌరారం ప్రాంతాల్లో 40 నుంచి 37.2 డిగ్రీల మధ్యలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సూర్యాపేట జిల్లాలోనే 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్, బొమ్మలరామారంలో 41.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.



సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి

నల్లగొండ టౌన్ : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన ఆ సంఘం 7వ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈరోజు సమస్యల నిలయంగా మారిందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందన్నారు. సంక్షేమ బోర్డును ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని.. దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, నూనె వెంకటేశ్వర్లు, కేఎస్ రెడ్డి, ధోటి వెంకన్న, గుండె రవి, రేవెల్లి యాదయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఉజ్జిని రత్నాకర్‌రావు

పెట్ జోన్స్..

పెంపుడు జంతువుల కోసం ప్రత్యేకంగా స్టోర్స్

వాటికి కావాల్సిన వస్తువులు.. ఆహార పదార్థాలు ఒకే చోట

- కుక్కలు, పిల్లుల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటైన క్లీనిక్‌లు
- ప్రత్యేకంగా పప్పీస్ బ్రీడ్ విక్రయం
- కేర్ టేకింగ్ సైతం అందుబాటులోకి..





నల్లగొండలో వెలసిన పెట్ స్టోర్

పెంపుడు జంతువులను పెంచడం ప్రస్తుతం ట్రెండ్‌గా మారింది. కొందరు సరదా కోసం కుక్కలు, పిల్లులు, పక్షులు వంటి వాటిని పెంచుతుంటారు. అయితే ఒకప్పుడు పెంపుడు జంతువులు కావాలన్నా.. వాటికి సంబంధించిన వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలన్నా.. హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మన ప్రాంతంలో కూడా జంతు ప్రేమికులు పెరగడం.. రకరకాల జాతులకు చెందిన జంతువులను పెంచుతుండడంతో ఇప్పుడు నల్లగొండ పట్టణంలో కూడా పెట్స్ కోసం ప్రత్యేక స్టోర్స్, క్లీనిక్‌లు వెలిశాయి. – రామగిరి(నల్లగొండ)

ఇళ్లలో పిల్లులు, కుక్కల్ని పెంచుకునేవారు.. వాటిని ఎంతో ఇష్టంగా చూసుకుంటారు. అయితే, వీటిని పెంచడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వాటికి ప్రత్యేక దుస్తులు, బెల్ట్‌లు, బెడ్‌లు, ఆహార పదార్థాలు అవసరం. ఇప్పుడు నల్లగొండ పట్టణంలో వాటికోసం ప్రత్యేక స్టోర్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కుక్కలు, క్యాట్‌లకు కావాల్సిన అన్ని రకాల ఆహార పదార్థాలు, బెల్ట్, బెడ్, షాంపులు లభిస్తాయి. అన్ని రకాల పప్పీస్ బ్రీడ్ విక్రయిస్తారు. అంతే కాకుండా ఇంటి వద్దకు వెళ్లి డాగ్‌కు కావాల్సిన సర్వీస్ చేస్తారు. కుక్కల యజమానులు ఔటింగ్‌కు వెళ్లినప్పుడు డే కేరింగ్ సౌకర్యం ఉంది. డాగ్స్‌కు గ్రూమింగ్, బాతింగ్ చేయిస్తారు. అంతే కాకుండా వాటికి ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. పర్సనల్ డాక్టర్లు కూడా ఉన్నారు.



కుక్కలకు అందించే ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరి..

కుక్క పిల్లలకు మొదటి 30 రోజుల వరకు మదర్ మిల్క్ తప్పనిసరి. ఒకవేళ మదర్ మిల్క్ సరిపోకపోతే 20 రోజులు దాటిన తర్వాత బాలెన్స్‌డ్ ఫుడ్ అందించాలి. 30 రోజుల వయస్సు తర్వాత హైప్రొటీన్‌తో కూడిన స్టాటర్ ఫుడ్ అందించాలి. 3 నుంచి 18 నెలల మధ్యలో లెస్ ప్రొటీన్ ఉన్నటువంటి పప్పి ఫుడ్ పెట్టాలి. 18 నెలల తర్వాత ఇచ్చే ఫుడ్‌ను అడల్ట్ ఫుడ్ అంటారు. ఇందులో పెడిగ్రీ ప్రో, రాయల్ కానైన్, వెట్ ప్రొ, డ్రూల్స్, ఎస్ అండ్ డీ ఇలా చాలా రకాల ఫుడ్స్ ఉంటాయి. ప్రెగ్నెన్సీ సమయంలో ఇచ్చే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలి. మదర్‌తో కడుపులో ఉన్న పప్పీని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ఇవ్వాలి. ఇందులో హై ప్రొటీన్, కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ ఏ, ఈ, అమైనో యాసిడ్‌లు ఉంటాయి.

పెట్టకూడని ఆహారం..

పెంపుడు జంతువులకు కొన్నిసార్లు ఆహారం వల్ల కూడా ప్రాణాపాయ స్థితి వస్తుంది. ముఖ్యంగా మొదటి ఆరు నెలల వరకు చికెన్ పెట్టకూడదు. ముళ్లు ఉన్న చేప ముక్కలు పెట్టవద్దు. ద్రాక్ష, చాక్‌లెట్, చాక్‌లెట్ కేక్, ఆల్కహాల్, కూల్ డ్రింక్స్ అస్సలు ఇవ్వకూడదు. మసాలా, కారం వాటికి అలర్జీని కలిగిస్తాయి.





అనుబంధం పెరిగింది



మొదటిసారి కుక్కను పెంచుతున్నా. ఆరు నెలల క్రితం జర్మన్ షఫర్డ్‌ను తెలిసిన వాళ్ల ద్వారా బెంగళూరు నుంచి తెప్పించా. ఇంట్లో మనిషిలాగా కుక్కతో అనుబంధం పెరిగింది. ఒక్కరోజు కూడా చూడకుండా ఉండలేను. బయటి నుంచి ఇంటి రాగానే ఎదురు వస్తుంది. కుక్క ఆరోగ్యం, ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాం. – నవీన్, నల్లగొండ

కుక్కలను పెంచడం హాబీ



నేను 12 సంవత్సరాలుగా పలు రకాల కుక్కలను పెంచుతున్నాను. ఇప్పుడు బ్రీడింగ్ చేసి విక్రయిస్తూ బిజినెస్‌గా మార్చుకున్నాను. ల్యాబ్, జర్మన్ షఫర్డ్, పమేరియన్, ఆల్‌షేషన్, గ్రేడెన్ పెంచడంతో పాటు బ్రీడింగ్ చేసి విక్రయిస్తాను. కుక్కలను పెంచడం నాకు హాబీ అయ్యింది. – ఎస్.అచ్యుత్, నల్లగొండ

పప్పీస్ బ్రీడ్ అమ్ముతాం



నల్లగొండ పట్టణంలో మా వద్ద అన్ని రకాల పప్పీస్ బ్రీడ్ విక్రయిస్తాం. కుక్కలు, క్యాట్స్‌కు కావాల్సిన అన్ని రకాల ఆహార పదార్థాలు, బెల్ట్, బెడ్, షాంపులు లభిస్తాయి. అంతే కాకుండా ఇంటి వద్దకు వెళ్లి డాగ్‌కు కావాల్సిన సర్వీస్ చేస్తాం. కుక్కల యజమానులు ఔటింగ్‌కు వెళ్లినప్పుడు డే కేరింగ్ సౌకర్యం ఉంది. డాగ్స్‌కు గ్రూమింగ్, బాతింగ్ చేస్తాం. – డి.వంశీ, హన్ని పెట్‌జోన్

వ్యాక్సిన్ వేయించాలి

డాగ్ పుట్టిన నెల రోజుల నుంచి 6 నెలల వయస్సు వరకు డీ వార్మింగ్ తప్పకుండా చేయాలి. 45 రోజులకు వ్యాక్సిన్ వేయించాలి. ఆ తర్వాత నెల రోజులకు బూస్టర్ డోస్ వేయాలి. 90 రోజుల వయసులో యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయాలి. అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించాలి. ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. – డాక్టర్ విక్రమ్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్

స్వర్ణగిరి క్షేత్రంలో ఘనంగా హనుమాన్ జయంతి



స్వర్ణగిరి క్షేత్రంలో ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నవ కలశపూర్వక పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, లక్ష తమలపాకులతో అర్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఆత్మహత్య



భార్గవి (ఫైల్)

రామన్నపేట: ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రామన్నపేట మండలం బోగారం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బోగారం గ్రామానికి చెందిన కూనూరు సుదర్శన్, లక్ష్మి దంపతుల కుమార్తె కూనూరు భార్గవి(22) డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటూ పీజీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. భార్గవి తండ్రి సుదర్శన్ పది నెలల క్రితమే చనిపోయాడు. తల్లి లక్ష్మి కుట్టు పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం మధ్యాహ్నం తల్లి బయటకు వెళ్లగా.. భార్గవి ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి తల్లికి సమాచారం అందించారు. మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్గవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

దళారులు, రైస్ మిల్లు యాజమాన్యం మధ్య వాగ్వాదం

- ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు



గాయపడిన రైస్‌మిల్లు యజమాని రంగనాథ్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి శివారులో ఓ రైస్‌మిల్లు వద్ద శనివారం దళారులు, రైస్ మిల్లు యాజమాన్యం మధ్య వాగ్వాదం జరిగింది. యాద్గార్‌పల్లి శివారులోని సూర్యతేజ రైస్‌మిల్లుకు శనివారం కొంతమంది రైతులు ధాన్యం తీసుకురాగా.. ఈ రోజు కొనుగోలు చేయం, రేపు రమ్మంటూ మిల్లు యాజమాన్యం చెప్పారు. దీంతో బాదలాపురం గ్రామానికి చెందిన దళారులు శివనేని నాగరాజు, శివనేని వెంకన్న, శివనేని సైదులు మిల్లు వద్దకు వచ్చి మిల్లు యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్యలు మిల్లు వద్దకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు సంబంధించిన ధాన్యం కానప్పటికీ నాగరాజు, వెంకన్న, సైదులు కలిసి తనతో పాటు తన అన్న సురేష్, గుమాస్తాలపై దాడి చేశారని సూర్యతేజ రైస్‌మిల్లు యజమాని పయిడిమర్రి రంగనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సూర్యతేజ మిల్లు యాజమాన్యం కూడా తమపై దాడికి పాల్పడ్డారని దళారులు నాగరాజు, వెంకన్న, సైదులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అన్నారు.

- వనజీవితో ప్రత్యేక అనుబంధం



కోదాడ: శ్రీమన్నారాయణ కాలనీలో మొక్క నాటుతున్న రామయ్య దంపతులు (ఫైల్)



రామయ్య దంపతులతో కోదాడకు చెందిన కొల్లు లక్ష్మీనారాయణ (ఫైల్)



నల్లగొండ కలెక్టర్ బంగ్లాలో రామయ్య దంపతులతో కలిసి మొక్క నాటుతున్న అప్పటి కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ (ఫైల్)

సురేష్ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- ఇద్దరు వ్యక్తులు హత్య చేసినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు
- నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంల ఏర్పాటు



సురేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సురేష్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్ హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో రామగిరి సెంటర్‌లోని గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్ నిర్వహిస్తున్న సురేష్ వద్దకు శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి వచ్చి తమకు ఫొటోలు ప్రింట్ తీసి ఇవ్వాలని కోరారు. దీంతో సురేష్ ప్రింట్ మిషన్ ఆన్ చేసి కంప్యూటర్‌పై కూర్చున్న సమయంలో నిందితులు మొదట అతడి గొంతు కోసి ఆ తర్వాత గుండెలపై విచక్షణారహితంగా పొడవడంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసు జాగిలాలు, ఫింగర్ ప్రింట్స్ టీంలను పిలిపించి వివరాలు సేకరించారు. ఇద్దరు వ్యక్తులు హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. సీసీ కెమెరాల సీడీఆర్‌ను సేకరించడంతో పాటు మృతుడి కాల్ డేటా ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు. హత్య అనంతరం నిందితులు ఏ దారి గుండా బయటకు వెళ్లారు. హత్యకు ముందు ఎక్కడి నుంచి వచ్చారనే కోణంలో నల్లగొండ పట్టణంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. పాత కక్షలతోనే హత్య చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఫొటో స్టూడియోలు బంద్ చేసి ర్యాలీ..

మృతుడు సురేష్ నల్లగొండతో పాటు నకిరేకల్, చిట్యాల, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో ఫొటో కలర్ ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సురేష్ హత్యకు గురికావడంతో నల్లగొండలో శనివారం ఫొటో, వీడియో గ్రాఫర్లు, కలర్ ల్యాబ్ యజమానులు ఫొటో స్టూడియోలు బంద్ చేసి నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. సురేష్ చిత్రపటానికి నివాళులర్పించారు. నిందితులను అరెస్ట్ చేసి సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

నకిరేకల్‌లో అంత్యక్రియలు

నకిరేకల్: సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శుక్రవారం రాత్రే ఘటనా స్థలం నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం మధ్యాహ్నం పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత సురేష్ సొంతూరు నకిరేకల్‌కు అతడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నల్లగొండ ఆస్పత్రి మార్చురీ వద్ద సురేష్ కుటుంబ సభ్యులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. సురేష్ సొంతూరు కట్టంగూర్ మండలం పందెనపల్లి కాగా.. కొన్నేళ్ల క్రితమే కుటుంబం అంతా నకిరేకల్‌లోని చీమలగడ్డ ఫ్లైఓవర్ సమీపంలో స్థిర నివాసం ఏర్పరుచుకుని గూనల వ్యాపారం చేసుకుంటున్నారు. సురేష్ తల్లి, భార్య నాగమణి కలిసి గూనల వ్యాపారం నిర్వహిస్తుండగా.. సురేష్ ఏడేళ్ల క్రితమే నల్లగొండలో ఫొటో కలర్ ల్యాబ్ పెట్టుకుని ప్రతిరోజు నకిరేకల్ నుంచి వెళ్లి వస్తున్నాడు. సురేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేష్ తండ్రి 30ఏళ్ల క్రితమే చనిపోగా.. తల్లి రెండు నెలల క్రితమే మృతిచెందింది. సురేష్ మృతదేహానికి నివాళులర్పించిన వారిలో టీపీసీసీ నేత దైద రవీందర్ తదితరులు ఉన్నారు.

టిప్పర్ ఢీకొని ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా



కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు



రోడ్డుపై పడిపోయిన ధాన్యం

- కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం

నేరేడుచర్ల: టిప్పర్ ఢీకొని ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటన కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం జరిగింది. వివరాలు.. నేరేడుచర్ల మండలం దాసారం గ్రామానికి చెందిన రైతు పెరుమాళ్ల సతీష్ శనివారం ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడు చేసుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి పైకి ట్రాక్టర్ ఎక్కుతుండగా మిర్యాలగూడ నుంచి చిల్లేపల్లి వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడి ధాన్యం రోడ్డుపై పడిపోయింది. రోడ్డుకు ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్, ట్రాక్టర్‌ను రోడ్డు పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం సమీపంలో ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వట్టిపల్లికి చెందిన వట్టికొట్టి శేఖర్(35) తన లారీలో భద్రాచలం నుంచి పేపర్ లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి శేఖర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు పాండు ఫిర్యాదుతో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ జగన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం



సంపత్ కుమార్‌రెడ్డి (ఫైల్)

కట్టంగూర్: ఉద్యోగం సాధించలేకపోయానని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం ఎరసానిగూడెంలో జరిగింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎరసానిగూడేనికి చెందిన యాపాల వెంకట్‌రెడ్డి, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు సంపత్‌కుమార్‌రెడ్డి(24) ఎంసీఏ వరకు చదువుకున్నాడు. వెంకట్‌రెడ్డి 18ఏళ్ల క్రితం చనిపోవడంతో తల్లి లక్ష్మి నార్కట్‌పల్లిలో నివాసముంటూ కుమారులను చదివించింది. సంపత్‌కుమార్‌రెడ్డి ఉద్యోగ ప్రయత్నాలతో పాటు యూఎస్ వెళ్లేందుకు పలుమార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ నెల 11న నల్లగొండకు వెళ్తున్నానని తల్లికి చెప్పిన సంపత్‌కుమార్‌రెడ్డి నల్లగొండకు వెళ్లకుండా స్వగ్రామమైన ఎరసానిగూడేనికి వెళ్లి బంధువులతో మాట్లాడాడు. తల్లి ఫోన్ చేయగా.. బాధపడుతూ మాట్లాడి ఫోన్ పెట్టేశాడు. మళ్లీ ఎన్నిసార్లు ఫోన్ చేసినా అతడు లిఫ్ట్ చేయలేదు. తీవ్ర మనస్తాపంలో ఉన్న సంపత్‌కుమార్‌రెడ్డి తన ఇంట్లో పైకప్పుకు ఉన్న చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లి, అన్నయ్య ఇంటికి వచ్చి చూసేసరికి అప్పటికే సంపత్‌కుమార్‌రెడ్డి మృతిచెందాడు. కష్టపడి చదివినా ఉద్యోగం సాధించలేకపోయానని, యుఎస్‌కు వెళ్లేకపోయానని మనస్తాపంతో తన తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న వెంకటరమణారెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

గ్రూప్-1 టాపర్‌ను అభినందించిన సీఎం



సీఎం రేవంత్‌రెడ్డితో వెంకటరమణ, అతడి తల్లిదండ్రులు

నల్లగొండ: గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన దాది వెంకటరమణను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. వెంకటరమణ, అతడి తల్లిదండ్రులు రమాదేవి, శ్రీనివాసరావు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రూప్–1 పరీక్షలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటరమణ ప్రస్తుతం జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వెంకటరమణ పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయిలో గ్రూప్–1లో రెండో ర్యాంకు సాధించడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇటికాల సాత్విక్ రెడ్డి, అఖిల్‌రెడ్డి, వాసుదేవ్, సీనియర్ జర్నలిస్ట్ ఇటికాల రమణారెడ్డి పాల్గొన్నారు.

50ఏళ్ల జ్ఞాపకాలను పంచుకున్న పూర్వ విద్యార్థులు



కుటుంబ సభ్యులతో సర్వేల్ గురుకుల విద్యాలయం 1975-76 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు

- సర్వేల్ గురుకులం 1975–76 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల విద్యాలయం పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. 1975–76 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సర్వేల్‌లోని గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో కలియదిరిగి నాటి జ్ఞాపకాలను నెమరుసువేసుకుని ఫొటోలు దిగారు. ఆ తర్వాత చౌటుప్పల్ మండలంలోని పతంగి గ్రామ పరిధిలోని బట్టిప్రోలు భాస్కర్‌రావు తోటలో సమావేశమయ్యారు. వృద్ధాప్యానికి చేరిన పూర్వ విద్యార్థులు నాటి స్మృతులను పంచుకున్నారు. అప్పటి పరిస్థితులు, విద్యాబోధన చేసిన ఉపాధ్యాయుల గురించి మాట్లాడుకున్నారు. ప్రస్తుతం తమ స్థితిగతులపై ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మల్లారెడ్డి, పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి డి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో తల్లి, కుమార్తె మృతి

- మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో ఘటన



రాజేశ్వరి (ఫైల్)



వేద సాయిశ్రీ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్: అనుమానాస్పద స్థితిలో తల్లి, కుమార్తె మృతి చెందారు. ఈ ఘటన శనివారం మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో చోటు చేసుకుంది. మిర్యాలగూడ వన్ టౌన్ సీఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన గుర్రం సీతారాంరెడ్డి ఓ ప్రైవేట్ ఆగ్రో కెమికల్ కంపెనీకి నల్లగొండ జిల్లా సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తూ మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 10వ తేదీన కంపెనీ పని మీద సీతారాంరెడ్డి హైదరాబాద్‌కు వెళ్లగా.. ఆయన భార్య రాజేశ్వరి(34), చిన్న కుమార్తె వేదసాయిశ్రీ(13)తో పాటు పెద్ద కుమార్తె వేదశ్రీ ఇంటి వద్దనే ఉన్నారు. హైదరాబాద్‌లో పని ముగించుకొని శనివారం తిరిగి మిర్యాలగూడకు వస్తుండగా.. సీతారాంరెడ్డి పెద్ద కుమార్తె ‘ఎక్కడ ఉన్నావు డాడీ’ అంటూ మెసేజ్ చేసింది. దీంతో ‘ఇంటికి వస్తున్నాను’ అంటూ సీతారాంరెడ్డి రిప్లై ఇచ్చాడు. అనంతరం కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు. సాయంత్రం 5గంటలకు సీతారాంరెడ్డి ఇంటికి వచ్చేసరికి పెద్ద కుమార్తె వేదశ్రీ తలుపు తీసుకొని తండ్రి వద్దకు పరుగెత్తుకు వచ్చింది. లోపలికి వెళ్లి చూడగా చిన్న కుమార్తె వేదసాయిశ్రీ మెడపై గాయంతో రక్తపుమడుగులో పడి ఉంది. బెడ్‌రూం వైపు వెళ్లి చూడగా రూం లోపల నుంచి గడియపెట్టి ఉంది. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా చీరతో రాజేశ్వరి ఉరేసుకుని కనిపించింది. వెంటనే డయల్ 100కు ఫోన్ చేయగా.. మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

హత్యా..? ఆత్మహత్యా..?

సీతారాంరెడ్డి పెద్ద కుమార్తెను పోలీసులు ప్రశ్నించగా.. తాను నిద్రపోయామని చెబుతుండడంతో తల్లి, కుమార్తెది హత్యా..? లేక ఆత్మహత్యా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న వన్ టౌన్ సీఐ మోతీరాం, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు మృతదేహాలను పరిశీలించారు. నల్లగొండ నుంచి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తల్లి, కుమార్తె మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని, మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధాన్యం బస్తాలు మీదపడి హమాలీలకు గాయాలు



లారీలో నుంచి కిందపడిపోయిన ధాన్యం బస్తాలు

మాడ్గులపల్లి: ఐకేపీ కేంద్రంలో ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బస్తాలు కూలి ముగ్గురు హమాలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం పాములపాడు గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో శనివారం ధాన్యం కాంటా అనంతరం బస్తాలను అదే గ్రామానికి చెందిన హమాలీలు ఏర్పుల లింగయ్య, గండమల్ల కృష్ణయ్య, బొల్లెద్దు వెంకన్న లారీలోకి లోడ్ చేస్తున్నారు. ఈ క్రమంలో గండమల్ల కృష్ణయ్య లారీ పైనుంచి కిందపడిపోవడంతో కింద లారీ వద్దకు ధాన్యం బస్తాలను మోసుకొస్తున్న లింగయ్య, వెంకన్నపై బస్తాలు ఒక్కసారిగా మీదపడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మిగతా హమాలీలు గమనించి చికిత్స నిమిత్తం వారిని గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఏలాంటి ఫిర్యాదు అందలేదని వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

- ఒకేరోజు 111 మందికి అప్పగించిన సూర్యాపేట ఎస్పీ నరసింహ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించిన ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా పోలీసులు రికవరీ చేసిన 111 ఫోన్లను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్టైతే ఆ వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో గత రెండేళ్లలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 2238 ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు వచ్చాయని, వీటిల్లో జిల్లా పోలీసులు 1362 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలపై పౌరులు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణ్‌రావు, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేతేపల్లి : మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శనివారం తెలిపారు. అందుకు సబ్‌స్టేషన్ పరిధిలోని కేతేపల్లి(టౌన్), చీకటిగూడెం, కొర్లపహాడ్, గుడివాడ, కొత్తపేట, ఇండస్ట్రియల్, కాసనగోడు గ్రామాల ఫీడర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయానికి రూ.5లక్షల విరాళం



నగదు అందజేస్తున్న అనూప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

కనగల్ : మండలంలోని బుడుమర్లపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.5లక్షల 30వేల విరాళం పంపారు. ఈ విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, మారయ్య, వెంకన్న, సైదులు, నర్సింహ, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

చండూరు : పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం చండూరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు.

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి



ఎమ్మెల్యే దంపతులకు తలంబ్రాలు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం లక్ష్మీనారాయణ

నకిరేకల్ : ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. భద్రాచలం రాములోరి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా ఆయన ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శనివారం రాత్రి సూర్యాపేట ఆర్టీసీ డీఎం లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ డీఎం సైదులు కార్గో నుంచి వచ్చిన తలంబ్రాలను స్వయంగా ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఆర్టీసీ కంట్రోలర్ పల్స వీరయ్యగౌడ్, సిబ్బంది చారి పాల్గొన్నారు.

నిజ నిర్ధారణ కమిటీ విచారణ

శాలిగౌరారం : ఇంటి స్థలం విషయంలో బాబాయిల మధ్య జరిగిన ఘర్షణలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తనను పోలీసులు కొట్టారని ఆరోపణలు చేసిన బాధితుడు రాపోలు అంజయ్య అలియాస్ అంజి ఘటనపై మానవ హక్కుల వేదిక సభ్యులు శనివారం నిజనిర్ధారణ కోసం విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో రాపోలు అంజయ్య, అతడి తమ్ముడు పరశురాములును విచారించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంజయ్యను తీవ్రంగా కొట్టిన ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వారిని సస్పెండ్ చేయాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. నిజనిర్ధారణలో జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి, ప్రతినిధులు అద్దంకి దశరథ, గడ్డం వెంకటరమణ, బల్లెం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు ఆర్.రాంబాబు అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయడంలో కాలయాపన చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి 17నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయడం లేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు రెడ్డిమాస్ ఇందిరాచౌదరి, పొడిశెట్టి దొడ్డయ్య గౌడ్, వంటెపాక అంబేద్కర్, వంటిపాక వెంకన్న, మాధవరెడ్డి, సైదులు, ఇంద్రకంటి నరేష్, బండారి రాములు, వసంత, పిచ్చయ్య, జానయ్య, అనంతరాములు, క్రిష్టారెడ్డి, నర్సింహ, వెంకటేశం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



నల్లగొండ : హనుమాన్ విజయయాత్రను ప్రారంభిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి



నల్లగొండ టూటౌన్ : యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని వీటీకాలనీలో గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా పాతబస్తీ హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి విజయోత్సవ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని పలు గ్రామాలలో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం శోభాయాత్రలో నిర్వహించారు. కార్యక్రమంలో పూల వెంకటయ్య, కొట రఘునందన్, పెద్దిరెడ్డి అనంతరెడ్డి, దాచపల్లి నర్సింహ, నాంపల్లి సంజీవ, సతీష్, పానగంటి మహేష్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని మాణిక్యాలమ్మగూడెం, ఈదులూరు, కట్టంగూర్ గ్రామాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి శ్రీనివాసశర్మ, ఓరుగంటి రమేష్, కోమటి భాస్కర్, దీప, సైదమ్మ, ఎల్లమ్మ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలు

కనగల్ : మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు శోభాయాత్రలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్తిక్, దుర్గాప్రసాద్, మధు, అనిల్, వాసు, చిరంజీవి, బాలు, చంటి తదితరులున్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



కట్టంగూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



నల్లగొండ : యాత్రలో పాల్గొన్న నాగం వర్షిత్‌రెడ్డి, పిల్లి రామరాజు తదితరులు



నల్లగొండ : యాత్రలో నృత్యాలు చేస్తున్న మహిళలు

నేరాల గుర్తింపులో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ : నేరాలను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమన్నారు. ప్రతిఒక్కరూ వాటి ప్రాధాన్యం తెలుసుకొని తమ కాలనీల్లో, ఇంటి ముందు భాగంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని చాలా కాలనీలలో సీసీ కెమెరాల నిఘా కరువైందన్నారు. కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి తమ కాలనీలను నేర రహిత కాలనీలుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వన్ టౌన్ ఎస్ఐలు శంకర్, సైదులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



ప్రజా పోరుబాట పాదయాత్ర ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుబాట పాదయాత్రను శనివారం మండలంలోని ఈదులూరు గ్రామంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై గళమెత్తేది ఎర్రజెండా ఒక్కటే అన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు. మండలంలో నాలుగు రోజుల పాటు 132 కిలోమీటర్లు 35గ్రామాల్లో సాగే పాదయాత్రకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. అదే విధంగా ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మొదటి రోజు పాదయాత్ర ముగింపులో భాగంగా రాత్రి చెర్వుఅన్నారం గ్రామంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, గంజి మురళీధర్, బొజ్జ చినవెంకులు, రాచకొండ వెంకన్న, జిట్ట సరోజ, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, వంటెపాక వెంకటేశ్వర్లు, కుమ్మరి శంకర్, ఇటికాల సురేందర్, కట్ట బక్కయ్య, గుండుగుంట్ల రామకృష్ణ, చిలుముల రామస్వామి, మురారి మోహన్, గడగోజు రవీంద్రాచారి, జాల రమేష్, సుజాత, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంలో వాటా ఎంతో చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

చండూరు : కల్తీ మద్యం కేసులో మొత్తం ఎమ్మెల్యే అనుచరులే ఉన్నారని, అందులో నీ వాటా ఎంతో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో ఎమ్మెల్యే అనుచరులను కాపాడారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి పైన, కమీషన్లపైనే ధ్యాస ఉందన్నారు. తన హయాంలో వందల కోట్ల అభివృద్ధి చేసానని అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, మునగాల నారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ తోకల వెంకన్నచంద్రకళ, అన్నెపర్తి శేఖర్, మాజీ మండల అధ్యక్షుడు పెదగోని వెంకన్న, మండల అధ్యక్షుడు వెంకన్న, పట్టణ అధ్యక్షుడు సతీష్, నాయకులు వెంకటేశం, వెంకట్‌రెడ్డి, వెంకటేశం, జానయ్య, గీతా, సువర్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో వారోత్సవాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కోటయ్య

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ రీజనల్ స్టడీసెంటర్‌లో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా సామాజిక సాధికారత వారోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింగ్ కోటయ్య పాల్గొని 'భారత రాజ్యాంగం సామాజిక న్యాయం'అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను ఎలా అర్థం చేసుకున్నారు అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బీఎల్ఐసీ కోర్సును ప్రారంభించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, బి.అనిల్‌కుమార్, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, అధ్యాపకులు బాల కిషోర్, పాష, ఖలీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గట్టుప్పల్ : మండల పరిధిలోని తేరట్‌పల్లిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం తహసీల్దార్ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో చలివేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవరెడ్డి, కార్యదర్శి శివ, సత్తయ్య ఉన్నారు.

వృద్ధాశ్రమంలో చీరలు, పండ్లు పంపిణీ



వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న బెటాలియన్ డీఎస్పీ వెంకన్న

నల్లగొండ : పట్టణంలోని శాంతి మహిళా మండలి వృద్ధాశ్రమంలో 12వ బెటాలియన్ డి కంపెనీ యాన్యువల్ రిఫ్రెష్మెంట్ కోర్సులో భాగంగా శనివారం కమాండెంట్ వీరయ్య ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా వారికి నిత్యావసర వస్తువులతో పాటు భోజన సౌకర్యం కల్పించినట్లు బెటాలియన్ డీఎస్పీ వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యుగేంధర్, ఎస్ఐలు విజయ్, మోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సురేష్ మృతికి సంతాపం

చండూరు : నల్లగొండలో హత్యకు గురైన ల్యాబ్ నిర్వాహకుడు గద్దపాటి సురేష్ మృతి పట్ల మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్త అంజిబాబు, ప్రధాన కార్యదర్శి వర్కాల కిరణ్, నాయకులు వెంకటాచారి, నాగయ్య, ఆంజనేయులు, రామకృష్ణ, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నల్లగొండలో ఫొటో ల్యాబ్ నిర్వహిస్తున్న గద్దపాటి సురేష్ మృతి పట్ల స్థానిక ఫొటోగ్రాఫర్లు నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్‌సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కనగల్ : నల్లగొండ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి మణికంఠ కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్‌ను హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని ఫొటోవీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు జెట్టి రాజు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దొంతరగోని నాగరాజు, ఉపాధ్యక్షులు సూరిగల శ్రీహరి, యాదగిరి, శివ, మహేందర్ పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి

నల్లగొండ టౌన్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరానికి అనుగుణంగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణ పరిధిలోని ఎస్ఎల్‌బీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, సరోజ, మధుసూదన్‌రెడ్డి, అరుణ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



విజేతలను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యను పరిష్కరించాలని, పీఆర్‌సీని అమలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 5డీఆర్ఎస్, ఈహెచ్ఎస్‌లను వెంటనే అమలు చేయాలని అన్నారు. అనంతరం కోదాడలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో ఏకపాత్రాభినయంలో ద్వితీయ బహుమతి సాధించిన గజవెల్లి సత్యంను, వాకింగ్‌లో ద్వితీయ బహుమతి పొందిన తాడూరి రమేష్‌ను సన్మానించారు. అదే విధంగా 40మంది జన్మదిన వేడుకలు చేసి సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యాద వాసుదేవ్, ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం, బి.మోహన్‌రావు, జెల్లా పుల్లయ్య, ఎస్.రంగయ్య, సుధాకర్, శేషారెడ్డి, కేశవాచారి, టి.రమేష్, బి.భిక్షం, రఘునాథం, అజంఅలీ, ప్రకాష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నల్లగొండ : చెక్కు అందజేస్తున్న నవీన్‌కుమార్‌గౌడ్

నల్లగొండ : పట్టణంలోని 30వవార్డు ఉస్మాన్‌పురలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక మాజీ కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్ గౌడ్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ షేక్ మీరాజ్, సయ్యద్ జుబేర్, సయ్యద్ అమీర్, మహ్మద్ ఫయిమ్ పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం స్థానికంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ లబ్ధి దారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీందర్ రావు, దొంతం అలివేలు, సంజీవరెడ్డి, నక్క శ్రీనివాస్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, మేతరి యాదయ్య, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్నబియ్యం ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమే



నల్లగొండ టూటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : రేషన్‌దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని జిల్లా స్థాపన దివాస్ కన్వీనర్, బీజేపీ జిల్లా నాయకుడు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 41వవార్డులో గావ్ చలో– బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా రేషన్‌దుకాణం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అదే విధంగా పద్మావతీకాలనీ, శ్రీనివాసకాలనీల్లో ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ ఫిషరీస్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ లోకన బోయిన రమణముదిరాజ్, మంగిలిపల్లి కిషన్, యాదయ్య, కాటమయ్య, శ్రీనివాసచారి ఉన్నారు.

కేతేపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతుందని బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు అయితగోని అనిత అన్నారు. గావ్ చలో– బస్తీ చలో అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని చీకటిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణం, సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట విజయలక్ష్మి, సుధాకర్, శ్రీనివాస్, పద్మ ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

కేతేపల్లి : కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొప్పోలు గ్రామంలో ఆయన పర్యటించి సమస్యలపై దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల రాంచంద్రు, నాగరాజు, అమృతరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, రేషన్‌దుకాణాల సందర్శన

చండూరు : గావ్ చలో– బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోడంగిపర్తి గ్రామంలో బీజేపీ నాయకులు శనివారం రేషన్‌దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, రామలింగయ్య, సైదులు, లింగస్వామి, సైదులు, మహేష్, యాదయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కనగల్ : ఆలయాలు, పాఠశాలల పరిసరాల పరిశుభ్రత పాటించాలని జాతీయ కిసాన్ మోర్చా సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం గావ్ చలో – బస్తీ చలో అభియాన్‌లో భాగంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పిండి పాపిరెడ్డితో కలిసి మండలంలోని చినమాధారం గ్రామంలో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నిర్సనమెట్ల ప్రసాద్, బీజేపీ నాయకులు శంకర్, వెంకటేశ్, భద్రమ్మ, కోటిరెడ్డి, శివప్రసాద్, కళ్యాణ్, శశివర్ధన్, శివ, మధుసూదన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చట్ట సవరణ చేపట్టడం సరికాదు

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని, సవరణ చేయడం సరికాదని సీపీఐ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని సుభాష్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం లౌకిక విధానాలకు తిలోదకాలు ఇచ్చి మనువాదాన్ని తీసుకువచ్చేందుకే ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్, ఎస్‌కె.మదార్, ముండ్ల ముత్యాలు, కేఎస్ రెడ్డి, అక్కలయ్య, భద్రయ్య, సుజాత, విజయ, మాధవి పాల్గొన్నారు.

నేడు పూలే-అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

కనగల్ : మండలంలో పూలే-అంబేద్కర్ జయంతులను ఆదివారం నిర్వహించనున్నట్లు మహనీయుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు దాసరి యాదగిరి, ఉపాధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని దోరెపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం పరిధిలోని ఇందుర్తి గ్రామంలో అనుమతులు లేకుండా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయరాదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినా అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గ్రామానికి చెందిన ఊరుపక్క నగేష్ శనివారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.